


సుందరీమణులు మెచ్చేలా..
ప్రపంచ సుందరీమణులు మెచ్చేలా ఏర్పాట్లు ఉండాలని పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ సూచించారు. - 8లో



బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో!
యాదగిరిగుట్ట మండలంలోని కుమ్మరి గూడేనికి ఏళ్లు గడుస్తున్నా బీటీ రోడ్డుకు మోక్షం కలగడం లేదు. - 9లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-34 (ఆదివారం సా॥)
సహర్ 4-55 (సోమవారం ఉ॥)

న్యూస్‌రీల్

సబ్ జైలును సందర్శించిన జిల్లా ప్రధాన జడ్జి



జైలు అధికారులతో మాట్లాడుతున్న జడ్జి

భువనగిరి టౌన్ : భువనగిరిలోని సబ్ జైలును శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు సందర్శించారు. ఖైదీలతో ముఖాముఖి జరిపి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జైలులో కల్పిస్తున్న వసతులు, భోజనం, న్యాయ సహాయం వంటి అంశాలపై జైలు సూపరింటెండెంట్ సెహ్రూతో చర్చించి సూచనలు చేశారు. జడ్జి వెంట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి వి.మాధవీలత తదితరులు ఉన్నారు.

గ్రామీణ రోడ్లను విస్తరించాలని వినతి



మంత్రి సీతక్కతో సమావేశమైన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : గ్రామీణ రోడ్లను విస్తరించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శనివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కోరారు. శనివారం శాసనసభ ప్రాంగణంలోని చాంబర్‌లో ఆమెతో సమావేశం అయ్యారు. ప్రస్తుతం ఉన్న రోడ్లు 3.5 మీటర్ల వెడల్పు మాత్రమే ఉన్నాయని, రోజురోజుకూ వాహనాల రద్దీ పెరగడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. 5.5 మీటర్లకు పెంచితే రాకపోకలకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈ సమస్యను ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. కాగా మంత్రి స్పందిస్తూ.. ఎమ్మెల్యే సూచనలను ఇప్పటికే పరిగణలోకి తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ రోడ్లను 5.5 మీటర్ల వెడల్పునకు పెంచేందుకు ప్రతిపాదనలు రూపొందించామని, త్వరలో టెండర్లు పిలువనున్నట్లు మంత్రి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి



సైదాపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శోభారాణి

యాదగిరిగుట్ట రూరల్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జెడ్పీ సీఈఓ శోభారాణి సూచించారు. యాదగిరిగుట్ట మండలం సైదాపురంలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా, ప్రస్తుతం జరుగుతున్న పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. వీలైనంతర త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు నూర్జహాన్‌కు మొక్కను బహూకరించారు. అనంతరం గ్రామంలో నీళ్ల ట్యాంకు, సీసీ రోడ్లను పరిశీలించారు. నీళ్ల ట్యాంకుకు మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం, వన నర్సరీని సందర్శించారు. అంతకుముందు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంపీఓ సలీం, పంచాయతీ కార్యదర్శి రోజా తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి నృసింహుడికి సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం చేసి తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను మాడ వీధుల్లో ఊరేగించారు.

భూములు కబ్జా చేస్తే జైలుకే

- కలెక్టర్ హనుమంతరావు



యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

యాదగిరిగుట్ట రూరల్ : భూ ఆక్రమణలకు పాల్పడేతే సహించేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కోర్టు కేసులకు సంబంధించిన భూ రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. భూ సమస్యలు పరిష్కరిస్తున్న తీరును తెలుసుకున్నారు. తహసీల్దార్ స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేయాలని, ఆ తరువాతనే ఫైల్ పంపాలన్నారు. ఆ విధంగా కాకుండా పేపర్‌వర్క్ చేసి నివేదిక పంపితే వారిపై చర్యలు తప్పవన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామస్థాయిలో ఇసుక రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరుగుతున్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని చెప్పారు.

'కబ్జాల కారోబార్' కథనానికి స్పందన

యాదగిరిగుట్ట మండలం జంగంపల్లి పంచాయతీ కార్యదర్శి గ్రామంలోని పలువురు రైతుల పేర్లను వారికి తెలియకుండా పహాణీలో మార్చి తనతో పాటు, భార్య, బంధువుల పేరున చేసుకోవడంపై కలెక్టర్ స్పందించారు. రైతుల పేర్లను పహాణీలో ట్యాంపరింగ్ చేసి.. కారోబార్ తమ పేర్లు నమోదు చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించామని తెలిపారు. పూర్తిస్థాయి విచారణకు ఆదేశించామని, ఆర్డీఓనుంచి నివేదిక రాగానే చర్యలు ఉంటాయన్నారు. దీని వెనుక ఎంతటివారున్నా ఉపేక్షించేది లేదన్నారు. రైతులకు న్యాయం చేస్తామని ఆందోళన చెందవద్దన్నారు. కాగా కారోబార్ భూ అక్రమాలపై 'కబ్జాల కారోబార్' శీర్షికతో ఈనెల 22వ తేదీన సాక్షి దినపత్రిక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే.

పశువుల కొట్టం కాదు.. 'డబుల్ ఇళ్లు'



నిరుపేదలకు ఇచ్చేందుకు మొదటి విడతలో భాగంగా భువనగిరి పట్టణ శివారులోని హుస్సేనాబాద్‌లో డబూల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులు సరిపోవంటూ కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశారు.దీంతో అవి అటూ ఇటూ కాకుండా ఆగిపోయాయి పశువులకు ఆవాసాలుగా మారుతున్నాయి. - భువనగిరి టౌన్

పల్లె చెంత.. వైద్యానికి చింత!

వైద్య ఆరోగ్యశాఖలో అడ్డగోలుగా డిప్యుటేషన్లు

- కోరుకున్న చోటకు బదిలీ
- హైదరాబాద్ సమీప ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం
- పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో సిబ్బంది కొరత
- చాలా చోట్ల సేవలకు ఆటంకం
- వైద్యం కోసం పట్టణాలకు జనం

గుండాల పీహెచ్‌సీ పరిధిలోని మాసాన్‌పల్లి సబ్ సెంటర్‌లో ఏఎన్‌ఎం, సెకండ్ ఏఎన్‌ఎం ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లిపోయారు. ఆ తరువాత వచ్చిన ఏఎన్‌ఎం కూడా వేరే ప్రాంతానికి బదిలీ చేయించుకోవడంతో ప్రస్తుతం ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) కేంద్రం నిర్వహణ చూస్తున్నాడు. అతనికి పక్కనున్న సబ్‌సెంటర్ల బాధ్యతలు కూడా అప్పగించడంతో మాసాన్‌పల్లి సబ్‌సెంటర్‌ను సరిగా తెరవడం లేదు. మండలంలోని మిగతా ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి.



ఏఎన్‌ఎంలు లేకపోవడంతో తెరుచుకోని గుండాల మండలం మాసాన్‌పల్లి ఆరోగ్య ఉపకేంద్రం

సాక్షి, యాదాద్రి : పల్లె వైద్యాన్ని కొత్త సమస్య వేధిస్తోంది. ఇప్పటికే తగినంత సిబ్బంది లేక సతమతం అవుతుండగా.. ఉన్నవారికీ అడ్డగోలుగా డిప్యూటేషన్లు ఇస్తుండడంతో సమస్య జఠిలమవుతోంది. వైద్యారోగ్యశాఖలో అన్నిస్థాయిల్లోనూ డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్ పద్ధతిలో పనిచేసే విధానం రద్దు చేస్తూ ప్రభుత్వం ఏడాది క్రితమే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డిప్యుటేషన్‌పై వెళ్లినవారంతా యథాస్థానాలకు రావాల్సి ఉండగా ఆ శాఖలోని ఉన్నతాధికారుల అండతో అక్కడే కొనసాగుతున్నారు. ఫలితంగా వైద్య సేవలపై ప్రభావం చూపుతోంది.

అధికంగా ఈ ప్రాంతాల నుంచి..
జిల్లాలో 21 పీహెచ్‌సీలు వాటికి అనుబంధంగా ఉపకేంద్రాలు ఉన్నాయి. ఆయా సెంటర్లలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిలో సింహభాగం హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో కొందరు మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్న ఉద్దేశంతో హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న ఆస్పత్రులకు డిప్యుటేషన్ వేయించుకుంటున్నారు. ప్రధానంగా ఆత్మకూర్(ఎం) పీహెచ్‌సీ పరిధిలో 8, మోత్కూరు 6, అడ్డగూడూరు 8, మోటకొండూరు 7, మునిపంపుల 9, యాదగిరిగుట్ట 6, భువనగిరి మండలం బొల్లేపల్లి 7, తుర్కపల్లి 5, రాజాపేట 4, సంస్థాన్‌నారాయణపురం పీహెచ్‌సీ పరిధిలో ముగ్గురు.. ఈ విధంగా మొత్తం 104 మంది డిప్యూటేషన్‌పై వెళ్లారు. వీరిలో వైద్యాధికారి స్థాయి మొదలుకొని స్టాఫ్ నర్సులు, ఎంపీ హెచ్‌ఈఓలు, హెల్త్‌సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

భువనగిరి యూపీహెచ్‌సీకి బయటి మండలాల నుంచి నలుగురు ఏఎన్‌ఎంలు డిప్యూటేషన్‌పై వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో రోగులకు సకాలంలో సేవలు అందడంలేదు.



రోగులకు సరైన సేవలందని రాజాపేట పరిధిలోని నమిలె హెల్త్ సబ్ సెంటర్

డిప్యుటేషన్లు రద్దు చేసినా బేఖాతర్

మెడికల్ గ్రౌండ్ ఉన్నవాళ్లకు మాత్రమే డిప్యుటేషన్‌కు అవకాశం ఇవ్వాలని ఆ శాఖనుంచి సూత్రప్రాయంగా ఆదేశాలు ఉన్నాయి. దీన్ని అవకాశంగా మలుచుకొని సిబ్బంది కోరుకున్న చోటకు డిప్యూటేషన్ ఇస్తున్నారని, దీనికి వెనక అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. గతంలో పనిచేసి వెళ్లిన ముగ్గురు డీఎంహెచ్‌ఓల హయాంలో పెద్ద ఎత్తున డిప్యుటేషన్లు జరిగాయి. ప్రభుత్వం డిప్యుటేషన్లను రద్దు చేసినా వారంతా అక్కడే కొనసాగుతున్నారు. డిప్యూటేషన్లు రద్దు చేయాలని ఇటీవల వైద్యారోగ్యశాఖలోని కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

- డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏడుగురు వైద్యాధికారులు, సిబ్బంది డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. జిల్లాలోని మెజార్టీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నిలిచిపోతున్న వైద్య సేవలు

- రాజాపేట పీహెచ్‌సీ పరిధిలోని నమిలే సబ్‌సెంటర్లో రికార్డు ప్రకారం ముగ్గురు ఏఎన్‌ఎంలు ఉన్నారు. ఈ ముగ్గురిని డిప్యుటేషన్‌పై వేర్వేరు చోటకు బదిలీ చేశారు. దీంతో ఇమ్యూనైజేషన్, వృద్ధులకు మాత్రల పంపిణీకి ఇబ్బందిగా మారింది. గర్భిణులకు వారంలో ఒక రోజే వ్యాక్సినేషన్ చేస్తున్నారు. ఓపీ సేవలూ సరిగా అందడం లేదు. రోజు విడిచి రోజు ఒకరిని డిప్యూటేషన్‌పై ఇక్కడికి పంపుతున్నారు. అదే విధంగా ఇదే పీహెచ్‌సీలో ఉన్న పల్లెదవాఖానకు డాక్టర్, ఏఎన్‌ఎం లేకపోవడంతో వైద్యసేవలు, గర్భనిర్ధారణ పరీక్షలు నిలిచిపోయాయి. బాలింతలకు సేవలు అందడం లేదు. వీహెచ్‌ఎన్‌డీ విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే జరుగడం లేదు.

హడలెత్తిస్తున్న బర్డ్‌ఫ్లూ

ఉమ్మడి జిల్లాలోని కోళ్లఫారాల్లో వ్యాధి విజృంభణ

- గుండ్రాంపల్లి, దోతిగూడెం, నేలపట్ల గ్రామాల్లో లక్షల కోళ్లు పూడ్చివేత
- వేల కొద్ది గుడ్లు, టన్నుల కొద్ది ఫీడ్‌ను పూడ్చుతున్న అధికారులు
- ఫారాల సమీపంలో మూడు కిలో మీటర్లు రెడ్ జోన్‌గా ప్రకటన

నల్లగొండ అగ్రికల్చర్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి కలకలం రేపుతోది. వ్యాధి వ్యాప్తి పెరిగి లక్షలాది బ్రాయిలర్, లేయర్ కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. బర్డ్‌ఫ్లూ సోకడంతో ఇప్పటికే భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం, చౌటుప్పల్ మండటం నేలపట్లలోని పలు పారాల్లోని వేలాది కోళ్లను అధికారులు పూడ్చి వేయించారు. ప్రస్తుతం చిట్యాల మండలం ఏపూరు సమీపంలోని కోళ్ల పారాల్లో వ్యాధి నిర్ధారణ కావడంతో కోళ్లను పూడ్చి వేయిస్తున్నారు. జిల్లా పశు వైద్య సంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమై బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల పారాలకు సమీప ప్రాంతాల్లో 3 కిలో మీటర్ల దూరం వరకు రెడ్ జోన్‌గా ప్రకటించారు.

భోపాల్ ల్యాబ్‌లో తనిఖీలు..
చిట్యాల మండలం ఏపూరు సమీపంలోని కోళ్ల ఫారాల్లో పశు సంవర్ధక శాఖ తనిఖీలు నిర్వహించి శాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించగా కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు అంచనాకు వచ్చారు. వాటి శాంపిళ్లను భోపాల్‌లోని నేషనల్ లెవెల్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజ్ సెంటర్‌కు పంపారు. ఫలితాల్లో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా పశు సంవర్ధక శాఖ అప్రమత్తమైంది. ఇక్కడి కోళ్ల పారాల్లోని సుమారు 2 లక్షల లేయర్ కోళ్లతో పాటు వేలాది గుడ్లను, టన్నుల కొద్దీ పీడ్‌ను జేసీబీలతో గుంతలు తీయించి పూడ్చివేయిస్తున్నారు.

52 ఆర్ఆర్‌టీ బృందాలు ఏర్పాటు
ఉమ్మడి జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఉధృతి నేపథ్యంలో జిల్లా పశు సంవర్ధక శాఖ 52 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను (ఆర్ఆర్‌టీ) ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో డాక్టర్‌తో పాటు ఐదుగురు సిబ్బందిని నియమించింది. కోళ్ల శాంపిల్స్‌ను సేకరించేందుకు వీరందరికీ ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఎక్కడైనా బర్డ్‌ఫ్లూ లాంటి లక్షణాలు ఉన్నాయనే సమాచారం అందిన వెంటనే ఈ బృందాలు అక్కడికి వెళ్లి పీపీఈ కిట్లను ధరించి శాంపిల్స్ సేకరించి భోపాల్ ల్యాబ్‌కు పంపనున్నారు.

ఫారాలను శానిటైజేషన్ చేయాలి
బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లఫారాలను ముందుగా శానిటైజేషన్ చేసుకోవాలి. ఫారాలకు వినియోగించే వాహనాలు కూడా శానిటైజేషన్ చేసుకోవడంతో బయట నుంచి వచ్చే వాహనాలు, ఫారాలకు దూరంగా పార్కింగ్ చేయాలి. ఎండాకాలంలో మూడు పూటల పీడ్ వేయకుండా ఉదయం, సాయంత్రం వేయాలి. వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు అవసరమైన మందులను వాడాలి. పారాల్లో కోళ్లు చనిపోతే వెంటనే శాంపిళ్లను పంపాలి. – డాక్టర్ జీవి. రమేష్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

వర్షం.. చల్లబడ్డ వాతావరణం



భువనగిరిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని జేసీబీతో తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

భువనగిరిటౌన్ : జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి, శనివారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. భువనగిరిలో 29 మి.మీ, యాదగిరిగుట్టలో 23.8 మి.మీ, బొమ్మలరామారం 23.3 మి.మీ, మోటకొండూరు 20 మి.మీ, తుర్కపల్లి 16.3 మి.మీ, రాజాపేట 17.3 మి.మీ, ఆలేరు 13.5 మి.మీ, బీబీనగర్ 10.5, ఆత్మకూరు(ఎం) మండలంలో 7.8 మి.మీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి భువనగిరితో పాటు పలు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. కాగా ఎండతీవ్రత వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలకు చల్లటి వాతావరణం ఉపశమనం కలిగించింది. రానున్న రెండు రోజులు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

తెరిచినా కనిపించడం లేదా..



భువనగిరిలోని కోర్టు ఎదుట తెరిచి ఉన్న జిరాక్స్ సెంటర్



జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద..

- పరీక్షల సమయంలో తెరిచి ఉంటున్న జిరాక్స్ సెంటర్లు
- కొరవడిన పర్యవేక్షణ

భువనగిరి టౌన్ : పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. కానీ, భువనగిరి పట్టణంలోని జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులకు అవేమీ పట్టడం లేదు. ఉదయం 8గంటల నుంచి 12.30 వరకు కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లు మూసివేయాల్సి ఉన్నా యథేచ్ఛగా తెరుస్తున్నారు. భువనగిరి పట్టణంలోని పలు చోట్ల శనివారం జిరాక్స్, నెంట్ సెంటర్లను తెరిచి ఉంచారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా కట్టదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

రెండో రోజు 8,605 మంది హాజరు
భువనగిరి : టెన్త్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం జరిగిన హిందీ పరీక్షకు 50 కేంద్రాల్లో 8,617 మంది విద్యార్థులకు గాను 8,605 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్ష కేంద్రంలో అందుబాటులో ఉంచిన మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

యాదగిరిగుట్ట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని శనివారం కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. గదుల్లోకి వెళ్లి పరీక్ష జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. పరీక్ష నిర్వాహకులతో మాట్లాడి సూచనలు చేశారు. అలాగే పరీక్ష కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యారోగ్య సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బంది కలిగినా వెంటనే చికిత్స అందించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు.

లక్ష్యం.. 4.50 లక్షల మెట్రిక్ టన్నులు

ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

- ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభం
- ఐకేపీ, పీఏసీఎస్, మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో 372 కేంద్రాలు



సాక్షి, యాదాద్రి : ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సిద్ధమవుతోంది. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 2,75,315 ఎకరాల్లో వరి సాగు చేయగా 6.05లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దీనికి అనగుణంగా రైతుల నుంచి 4.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో 3.50లక్షల మెట్రిక్ టన్నులు సీఎంఆర్ నిమిత్తం 37 మిల్లులకు కేటాయించనున్నారు. మిమితా లక్ష మెట్రిక్ టన్నులుఇతర జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాలకు తరలించే అవకాశం ఉంది.

372 కొనుగోలు కేంద్రాలు
ధాన్యం సేకరణకు 372 కేంద్రాలు ఏర్పా టు చేయనున్నారు. ఇందులో ఐకేపీ 122, పీఏసీఎస్ 234, రైతు సహకార సంఘాల ఆధ్వర్యంలో 16 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

1.12 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం
ధాన్యం సేకరణకు 1.12 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం కానున్నాయి. పాతవి 51లక్షల 75వేల బ్యాగులు ప్రస్తుతం అందుబాటులో ఉండగా.. కొత్వి 60.75లక్షలు కొనుగోలు చేయనున్నారు.అదే విధంగా టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం, తేమ యంత్రాలు సమకూర్చుకునే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి కల్పించడంతో పాటు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయనున్నారు.

వరికోతలు పూర్తయితేనే స్పష్టమైన అంచనా..
6.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత పెరగడంతో భూగర్భ జలాలు పడిపోయాయి. బోర్లు సరిగా పోయక పంటలకు నీరందలేదు. మూసీ పరీవాహక ప్రాంతంలో మినహా రాజాపేట, తుర్కపల్లి, ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూర్(ఎం), మోత్కూరు, నారాయణపురం మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి చేలు ఎండిపోయాయి. దీంతో దిగుబడి ఎంత వస్తుందనేది వరి కోతలు పూర్తయ్యాకే తేలనుంది.

మిల్లర్లు కొర్రీలు పెట్టవద్దు



ఏప్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తాం. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి. మిల్లర్లు కొర్రీలు పెట్టినా, తరుగు తీసినా సహించేదిలేదు. బస్తాకు 40.800 కిలోలు మాత్రమే తూకం వేయాలి.
–వీరారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



ఉమెన్ ఎంపవర్‌మెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాబార్డు జీఎం, అధికారులు, ధీశాలి సంస్థ ప్రతినిధులు

బొమ్మలరామారం : పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని నాబార్డు జీఎం గణపతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బొమ్మలరామారం మండలంలోని సోలిపేట గ్రామీణ మహిళా మండలి ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో శనివారం ధీశాలి మహిళా ఉత్పత్తిదారుల సంస్థ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధీశాలి సంస్థలోని 701 మంది మహిళా రైతులు ఉత్పత్తిదారులుగా ఎదగడానికి సమష్టిగా కృషి చేస్తున్న తీరు అభినందనీయమని, వారికి నాబార్డు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. అనంతరం ఉమెన్ ఎంపవర్‌మెంట్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీఎం ఎం అధ్యక్షురాలు దూబల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల నాబార్డు డీడీఎంలు వినయ్‌కుమార్, సత్యనారాయణ, ధీశాలీ సంస్థ బోర్డు డైరెక్టర్లు సుజాత, చంద్రకళ, పార్వతి, పద్మ, సీఈఓ హరిలాల్, ఖేతి సంస్థ, అగ్రిబ్రిడ్జ్ క్రిస్‌వాస్ సంస్థ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాదగిరీశుడి సేవలో ఎమ్మెల్యే దానం నాగేందర్



ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తుల వద్ద అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా పరశురాం



నియామకపత్రం అందుకుంటున్న పాలడుగు పరశురాం

భానుపురి: టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పాలడుగు పరశురాం నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతం చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణంలో పాల్గొన్న చినజీయర్ స్వామి, జూపల్లి రామేశ్వరరావు తదితరులు

మేళ్లచెరువు: మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం శ్రీత్రిదండి రామానుజ చినజీయర్ స్వామి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో గత 27 సంవత్సరాలుగా మేళ్లచెరువు గ్రామానికి బ్రహ్మోత్సవాలకు రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండగలుగుతున్నారని విశ్వాసంతో స్వామివారి పూజ చేయాలని భక్తులకు సూచించారు. అనంతరం విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించి భక్తులకు అందించారు.కార్యక్రమంలో అహోబిల రామానుజన్ జీయర్‌స్వామి, మైహోం గ్రూప్ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వర రావు, శ్రీకుమారి దంపతులు, మునగాల రామ్మోహన్‌రావు అరుణ దంపతులు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం'కు కొత్త చిక్కులు

- ఆన్‌లైన్‌లో పాత దరఖాస్తులు పెండింగ్ ఉన్నట్లు చూపిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్న దరఖాస్తుదారులు
- వెబ్‌సైట్ నుంచి పాత దరఖాస్తులు తొలగించాలని వేడుకోలు

త్రిపురారం: దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదు అన్న చందంలా మారింది రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేవారి పరిస్థితి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగ యువతతో పాటుగా ఇప్పటికే చిరు వ్యాపారులు చేసుకుంటున్న వారికి ఆర్థిక సాయం అందించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి సొంత వ్యాపారం చేసుకోవడానికి రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు 60 శాతం నుంచి 80 శాతం వరకు బ్యాంక్ లింకేజ్ సబ్సిడీ రుణాలు అందించనుంది. ఈ నెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పలు సందర్భాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రుణాలు అందించడానికి TSOBMMS.COM వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినా కొందరికి రుణాలు మంజూరు కాలేదు. అప్పుడు దరఖాస్తు చేస్తుకున్న లబ్ధిదారుల వివరాలు ఇంకా ఆన్‌లైన్‌లో పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పుడు రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా తిరిగి అదే TSOBMMS.COM వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో నూతనంగా దరఖాస్తు చేస్తున్న వారికి ఆన్‌లైన్‌లో పాత దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తోంది. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తులను కలెక్టరేట్‌లో ఆయా శాఖల పరిధిలో తొలగించే అవకాశం ఉందని, వాటిని తొలగించి గతంలో రుణాలు మంజూరు కాని వారికి మరో అవకాశం కల్పించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



రేషన్ కార్డులతోనూ అవస్థలు

ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ కార్డు తప్పనిసరి చేశారు. తెలంగాణలో రేషన్ కార్డులకు ఆధార్ కార్డులు లింక్ చేసి ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు ఉండాల్సి వస్తుంది. ఇటీవల ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు ఇవ్వడానికి ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకున్నారు. అయితే కొందరు నూతన రేషన్ కార్డు తీసుకునేందుకు గాను ఇప్పటికే తమ తల్లిదండ్రులతో ఉన్న రేషన్ కార్డుల్లో తమ పేర్లను తొలగించుకున్నారు. వారి పేర్లు రేషన్ కార్డుల్లో లేకపోవడంతో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియను త్వరగా పూర్తిచేసి రేషన్ కార్డులు అందించాలని, రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మరో నెల రోజుల పాటు పొడగించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

2020లో చేసుకున్న దరఖాస్తు పెండింగ్ చూపిస్తోంది



సబ్సిడీ లోన్ కోసం 2020లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. కానీ అప్పుడు లోన్ మంజూరు కాలేదు. ఇప్పుడు రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటుంటే గతంలో ఆన్‌లైన్ చేసిన పాత దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తోంది. ఇది ఎక్కడ తొలగించాలో అర్థం కావడంలేదు. జిల్లా అధికారులు గుర్తించి పాత దరఖాస్తులను ఆన్‌లైన్ నుంచి తొలగించాలి.

– కొలుకులపల్లి శ్యాంసుందర్ బాబు, సత్యనారాయణపురం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త రేషన్ కార్డులు ఇస్తాం



ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త రేషన్ కార్డులు అందజేస్తాం. రేషన్ కార్డుల ప్రక్రియ కొనసాగుతోంది. కొత్తగా వివాహం చేసుకున్నవారు పాత రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించుకుంటేనే కొత్త కార్డులు వస్తాయి. డీఎస్‌ఓ లాగిన్‌లో ఉంటాయి. గ్రామాల్లో విచారణ చేసి కొత్త కార్డులు అందజేస్తాం. దీనికి 4 నుంచి 5 రోజులు పట్టే అవకాశం ఉంది.

– గాజుల ప్రమీల, తహసీల్దార్, త్రిపురారం

గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన యువకులు

- కేజిన్నర గంజాయి ప్యాకెట్లు, బైక్ సీజ్ చేసిన పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల: జల్సాలకు అలవాటు పడి త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి అమ్ముతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ఇద్దరు యువకులు చిట్యాల పోలీసులకు పట్టుబడ్డారు. ఈ కేసు వివరాలను చిట్యాలలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్ జిల్లాకు చెందిన కమలేశ్ పాల్, నిర్భయ సింగ్ కొంతకాలం క్రితం రామన్నపేటకు వలస వచ్చి తోపుడు బండ్లపై ఐస్‌క్రీంలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పంకజ్ ద్వారా సుమారు కేజీన్నర గంజాయి కొనుగోలు చేసి బైక్‌పై చిట్యాల పట్టణ శివారులోని పంజాబీ దాబా వద్దకు తీసుకొచ్చారు. ఆ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో మార్చి కాలేజీ యువతకు అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు చిట్యాల పోలీసులు వారిని శనివారం ఉదయం పట్టుకున్నారు. వారి నుంచి కేజిన్నర గంజాయి ప్యాకెట్లను, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న చిట్యాల ఎస్‌ఐ ధర్మా, హెడ్‌కానిస్టేబుళ్లు పాషా, మధు, మల్లేష్, కానిస్టేబుళ్లు ఖలీం, నాగరాజు, గణేష్‌ను డీఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ ఎన్. ధర్మా పాల్గొన్నారు.

గేదెలు చోరీ చేస్తున్న ఐదుగురి అరెస్ట్

- అశోక్ లేలాండ్ వాహనం, కారు, రూ.3.20లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక

దేవరకొండ: గేదెలను చోరీ చేస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో ఆమె విలేకరులకు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన మహ్మద్ మతాబ్ సాహెబ్, సింహాద్రి, షేక్ రఫీ, షేక్ అస్లాం, ఒంటిపులి అఖిల్ కలిసి ముఠాగా ఏర్పడి గేదెలను చోరీ చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. ఈ నెల 1వ తేదీన దేవరకొండ మండలం మంగలోనిబావి గ్రామంలో ఉడుత శ్రీనుకు చెందిన 3 గేదెలు, ఉడుత సైదులుకి చెందిన ఒక గేదెను వీరు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం దేవరకొండలో గేదెలు చోరీ చేసేందుకు ఐదుగురు ముఠా సభ్యులు రెండు వాహనాల్లో రాగా.. పట్టణంలోని ముదిగొండ రోడ్డు వద్ద పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. నిందితుల నుంచి అశోక్ లేలాండ్ వాహనం, కారు, రూ.3.20లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. నిందితులపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ నర్సింహులు, ఎస్‌ఐలు అజ్మీరా రమేష్, కోటేష్, పోలీస్ సిబ్బంది అంజి, సతీష్, తిరుపతి, రాజారాం, సింహాద్రి తదితరులున్నారు.

ఇసుక కాంట్రాక్ట్ ఇప్పిస్తానని రూ.2 లక్షలు వసూలు

- డిండి ఇరిగేషన్ ఈఈపై విచారణకు ఆదేశించిన కలెక్టర్
- లాంగ్ లీవ్ పెట్టుకున్న సదరు ఈఈ

డిండి: ఇసుక కాంట్రాక్ట్ ఇప్పిస్తానని ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ సూపర్‌వైజర్ నుంచి డబ్బులు వసూలు చేసిన ఇరిగేషన్ ఈఈపై నల్లగొండ జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. వివరాలు.. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా సింగరాజుపల్లి ప్రాజెక్టుతో పాటు ప్రాజెక్టుకు నీటిని తరలించే టన్నెల్‌ను ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్మిస్తోంది. ఈ కంపెనీ సూపర్‌వైజర్‌కు ఇసుక కాంట్రాక్ట్ పర్మిషన్ ఇప్పిస్తానని చెప్పి డిండి ఇరిగేషన్ సర్కిల్ డివిజన్–8లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌రావు రూ.2లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. డబ్బులు ఇచ్చినా పర్మిషన్ రాకపోవడంతో సదరు సూపర్‌వైజర్ నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈఈ శ్రీధర్‌రావును కలెక్టర్ పిలిచి మందలించడంతో పాటు ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. అయితే ఈఈ శ్రీధర్‌రావు ఆరోగ్యం బాగోలేక లాంగ్ లీవ్ పెట్టుకోవడంతో.. డిండి ఇరిగేషన్ సర్కిల్ డివిజన్–8 ఇన్‌చార్జి ఈఈగా ఎలమందయ్యకు బాధ్యతలు అప్పగించారు.

ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

- నల్లగొండ పట్టణానికి చెందిన యువతి మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం



రోదిస్తున్న అమతుల్ కుటుంబ సభ్యులు

నల్లగొండ: హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగొండ పట్టణానికి చెందిన యువతి మృతిచెందింది. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీకి చెందిన ఇంతియాజ్ కుమార్తె అమతుల్(22) మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతోంది. ఆమెను రంజాన్ పండుగకు ఇంటికి తీసుకొచ్చేందుకు బీటెక్ చదువుతున్న కుమారుడు ఇంతియాజ్ ఫౌజన్(24)తో పాటు అతడికి తమ్ముడి వరుస అయిన పట్టణంలోని రహమాన్‌బాగ్ కాలనీకి చెందిన షాదాబ్ కారులో శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లారు. అమతుల్‌ను తీసుకుని వారు నల్లగొండకు తిరుగు ప్రయాణమయ్యారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఔటర్ రింగ్ రోడ్డుపై కీసర సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమతుల్ అక్కడికక్కడే మృతిచెందగా.. కారు నడుపుతున్న షాదాబ్‌తో పాటు ఫౌజన్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోనే వేర్వేరు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. ఫౌజన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై దృష్టి సారించాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: ఇంజనీరింగ్ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై దృష్టి సారించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సిద్దిపేట జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సెమినార్‌లో ఎంజీయూ ఇంజనీరింగ్ విద్యార్థులు(కంప్యూటర్ సైన్స్) గంజి పవన్, షేక్ షరీఫ్, వేల్పుల వెంకటపవన్‌కుమార్, దొడ్డి సందీప్ పాల్గొని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై పరిశోధన పత్రాలు సమర్పించారు. విద్యార్థులు శనివారం వీసీని కలిసి సెమినార్ అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై పట్టు సాధిస్తే భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం హెచ్‌ఓడీ జయంతి పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ ఉండాలి



సెమినార్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్, ఎంఎస్ఎన్ గ్రూప్ ప్రతినిధులు

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు సిలబస్ ఉండాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూలో శనివారం రసాయన శాస్త్ర విభాగం, ఎంఎస్ఎన్ లేబరోటరీస్ ఆధ్వర్యంలో ఫార్మా రంగంలో నవీన రీతులు అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమస్యలను సవాళ్లుగా తీసుకొని వాటి పరిష్కారాల దిశగా అభ్యసనం చేయాలని కోరారు. నాట్కో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ శైలేంద్ర దలాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని కోరారు. ఉత్పత్తుల సామర్థ్యం అనే అంశంపై కీలకంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎన్ గ్రూప్ ప్రతినిధులు డాక్టర్ లక్ష్మీరెడ్డి, హెచ్‌ఆర్ లక్ష్మీనరసింహమూర్తి, ప్రిన్సిపాల్ కె. ప్రేమ్‌సాగర్, డాక్టర్ రూప, డాక్టర్ దోమల రమేష్, డాక్టర్ వై. ప్రశాంతి, ప్రొఫెసర్ అన్నపూర్ణ, డాక్టర్ కళ్యాణి, జ్యోతి, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గణితంతో ప్రతిఒక్కరికి అవినాభావ సంబంధం



శిక్షణ పొందిన విద్యార్థులతో ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, అధ్యాపకులు

- ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి

నల్లగొండ టూటౌన్: సమాజంలో ప్రతిఒక్కరికి గణితంతో అవినాభావ సంబంధం ఉందని మహాత్మా గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. శనివారం ఎంజీయూ సైన్స్ కళాశాలలో గణిత విభాగం, ఎంటీటీఎస్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన గణిత శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వచ్చి గణితంపై శిక్షణ పొందడం అభినందనీయమన్నారు. ఈ శిక్షణ రాబోయే కాలంలో విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తుందని, ప్రతి విద్యార్థి గణితం ప్రాముఖ్యతను గుర్తించాలని కోరారు. ఢిల్లీలోని శివ్ నాడార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణరెడ్డి, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సుకుమార్, ఐఐటీ బాంబే ప్రొఫెసర్ శివాజీ గణేష్ విద్యార్థులకు గణితంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మద్దిలేటి పసుపుల, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, గణిత శాఖ కోఆర్డినేటర్ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి, సముద్రాల ఉపేందర్, డి. హైమావతి, ఎ. శ్రీనివాస్, ఎన్. కిరణ్‌కుమార్, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకుని లాభాలు పొందవచ్చు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎ. మరియాదాస్, రైతులు

- జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ మరియాదాస్

గరిడేపల్లి: గిడ్డంగుల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకుని రైతులు అధిక లాభాలు పొందవచ్చని జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ ఏ. మరియదాస్ అన్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం వేర్‌హౌజ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ యాక్ట్, నెగోషియబుల్ వేర్‌హౌజ్‌పై రైతులు, వ్యాపారులు, పప్పు మిల్లు యాజమానులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొలాల్లో ఎలుకల యాజమాన్యం గురించి క్లుప్తంగా తెలియజేశారు. రైతులు ధాన్యం నిల్వలో తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆహార ధాన్యాలను కాపాడుకోవచ్చునని లేకుంటే 10 నుంచి 30శాతం ధాన్యంకు చీడ పురుగులు, ఎలుకల వల్ల నష్టం వాటిల్లుతుందని అన్నారు. ధాన్యం నిల్వపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రైతులు నేరేడుచర్లలోని గిడ్డంగులను సందర్శించి ధాన్యం నిల్వ గురించి ప్రాక్టికల్‌గా తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, ఆదర్శ్, కిరణ్, మాధురి, రైతులు పాల్గొన్నారు.

మరో 5వేల కోళ్ల పూడ్చివేత



బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లను పూడ్చి పెట్టేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దోతిగూడెం గ్రామ పరిధిలోని శ్రీనివాస పౌల్ట్రీఫామ్‌లో బర్డ్ ఫ్లూ సోకిన మరో 5వేల కోళ్లను శనివారం రెండో రోజు కూడా చంపి భూమిలో పాతిపెట్టారు. ఈ పౌల్ట్రీ ఫామ్‌లో మొత్తం 40వేల కోళ్లకు గాను ఇప్పటి వరకు 35వేల కోళ్లను మెడ విరిచి చంపి గోనె సంచుల్లో మూటకట్టి గొయ్యి తీసి పాతిపెట్టారు. మిగిలిన కోళ్లను ఆదివారం ఖననం చేస్తామని జిల్లా పశువైద్యాధికారి పి. జానయ్య తెలిపారు. అదేవిధంగా శానిటైజేషన్ చేస్తామని అన్నారు. పౌల్ట్రీఫామ్‌ను నల్లగొండ జిల్లా వ్యాధి నిర్ధారణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సురేశ్ సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాస్, గోపిరెడ్డి, ఇందిర, మోతీలాల్, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు..

శ్రీనివాస పౌల్ట్రీఫామ్‌లో పనిచేస్తున్న కార్మికులకు శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 63 మంది కార్మికులు, సూపర్‌వైజర్లు, వెటర్నరీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి రక్తనమూనా శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌లోని లేబొరేటరీకి పంపించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి శ్రీవాణి, సూపర్‌వైజర్ అరుంధతి, ల్యాబ్ టెక్నీషియన్లు వసంత, హరిబాబు, ఇందిర, వైద్య సిబ్బంది లక్ష్మణ్, గోపాల్, బేగ్ పాల్గొన్నారు.

భారత్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపులో వాజ్‌పేయి పాత్ర కీలకం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి


చౌటుప్పల్: భారతదేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు రావడంలో దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పాత్ర ఎంతో కీలకమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను శనివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పేయి గ్రామీణ సడక్ యోజన పథకాన్ని తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల రూపురేఖలనే మార్చివేశారని తెలిపారు. దేశంలో అన్ని మారుమూల ప్రాంతాలకు మౌలిక వసతులను కల్పించారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల సరసన మన దేశం నిలబడిందంటే అందులో వాజ్‌పేయి కృషి ఎంతో గొప్పదన్నారు. బీజేపీ కార్యకర్తలు వాజ్‌పేయి స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కడారి కల్పన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, నాయకులు ఆలె చిరంజీవి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, ముత్యాల భూపాల్‌రెడ్డి, పాలకూర్ల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి): రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. తొండ గ్రామానికి చెందిన నర్సయ్య శుక్రవారం రాత్రి గ్రామ పరిధిలో రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్యకు తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ప్రపంచ సుందరీమణులు మెచ్చేలా ఏర్పాట్లు చేయాలి

- పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి



ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి

నాగార్జునసాగర్: ప్రపంచ సుందరీమణులు మెచ్చేలా, బుద్ధవనం పేరుప్రతిష్ఠలు చాటిచెప్పేలా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు తెలిసేలా బుద్ధవనంలో ఏర్పాట్లు చేయాలని పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లో జరిగే ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనే సుందరీమణులు మే 12వ తేదీన సాగర్‌ను సందర్శించనున్న నేపథ్యంలో శనివారం సాగర్‌లోని బుద్ధవనంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 140 దేశాల నుంచి ప్రపంచ సుందరీమణులు ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటారని వీరంతా మే 12న నాగార్జునసాగర్‌కు రానున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి బయల్దేరి విజయవిహార్‌కు చేరుకుంటారని, అనంతరం బుద్ధవనాన్ని సందర్శిస్తారని తెలిపారు. వారికి స్వాగతం పలికేందుకు కళాకారులతో స్వాగత కార్యక్రమం, డ్రోన్‌షో వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఆరోజు అటవీశాఖ ద్వారా బుద్ధవనంలో మరింత పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. బుద్ధవనం సందర్శించే వారందరికీ రాత్రి భోజనం, వసతి సౌకర్యం ఏర్పాటు చేయాలని, దీని కోసం సమగ్రంగా ప్రణాళిక రూపొందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొని ఇక్కడికి వచ్చే వారందరికీ అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ యంత్రాంగం తరపున చేస్తామని, వారికి అవసరమైన వసతులు కల్పిస్తామని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఇన్‌చార్జిగా ఉంటారని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ.. బుద్ధవనం సందర్శించే ప్రపంచ సుందరి పోటీదారులందరికీ పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తామని ఆ రోజు బుద్ధవనం వచ్చే వారందరికీ పాసులు జారీ చేయడంతో పాటు పోలీస్ సెక్యూరిటీ, అంబులెన్స్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, బుద్ధవనం ఓఎస్డీ సుభాన్‌రెడ్డి, పురావస్తుశాఖ కన్సల్టెంట్ వి. నాగిరెడ్డి, పర్యాటకశాఖ ఇంజనీరింగ్ అధికారులు, అటవీశాఖ అధికారి సంగీత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.